క్లుప్తంగా

నిధుల కేటాయింపుపై హర్షం



ఖలీల్‌వాడి: రాష్ట్రంలోని న్యాయవాదుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లు విడుదల చేస్తున్నట్లు హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులకు సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇటీవల హామీ ఇచ్చారు. ఈసందర్భంగా నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. అలాగే న్యాయవాదుల హెల్త్ ఇన్సూరెన్స్ రూ.10 లక్షలు పెంచాలని, న్యాయవాదుల సంక్షేమం కోసం ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. న్యాయవాద వృత్తిలో నూతనంగా వస్తున్న జూనియర్ న్యాయవాదులకు ఇన్సూరెన్స్, స్టైఫండ్, ఆఫీస్ నెలకోల్పేందుకు ఆర్థిక సాయం అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని ఆయన కోరారు.

యూనియన్‌లో చేరిక



నిజామాబాద్‌నాగారం: విద్యుత్‌శాఖ 327 యూనియన్(ఐఎన్‌టీయూసీ)లో మంగళవారం టీఆర్‌వీకేఎస్ యూనియన్ నాయకులు, సభ్యులు భారీగా చేరారు. జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయ ఆవరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి గంగాధర్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా 327 యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇనుగాల శ్రీధర్ హాజరై, మాట్లాడారు. ఉద్యోగుల సంక్షేమ కోసం యూనియన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆయన సమక్షంలో టీఆర్‌వీకేస్, హెచ్–58 యూనియన్‌ల నుంచి జూనియర్ లైన్‌మెన్, ఆర్టిజన్‌లు చేరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఐలేష్, వేణుగోపాల్‌రావు, పెంటయ్యచారి, మనోహర్, మోహన్, శ్రీనివాస్, ముస్తాక్, నగేష్, కళ్యాన్, ప్రభు, సతీష్, నరింహాలు, తదితరులు పాల్గొన్నారు.

టమాట ధర ఢమాల్

- మార్కెట్‌లో దక్కని గిట్టుబాటు ధర
- ఆందోళనలో రైతులు





బుస్సాపూర్‌లో బాక్స్‌లో నింపిన టమాట

బాల్కొండ: దళారులు, వ్యాపారుల మాయాజాలంతో మార్కెట్‌లో టమాట ధర అమాంతం పడిపోయింది. రైతులకు గిట్టుబాటు ధరను పక్కన పెడితే.. కనీసం మద్దతు ధర కూడా దక్కని పరిస్థితి నెలకొంది. వారం రోజుల క్రితం అధికంగా ఉన్న ధర ఒక్కసారిగి పడిపోయింది. టమాట పంటను ప్రస్తుత ఏడాది రైతులు అధికంగా సాగు చేశారు. పంట చేతికొచ్చిన నాటి నుంచి టమాటకు ధర దక్కడం లేదు. గతేడాది టమాటకు 25 కిలోల బాక్స్ ధర గరిష్టంగా రూ. 3 వేల వరకు పలికింది. దీంతో ప్రస్తుత ఏడాది కూడా మంచి ధర ఉంటుందని రైతులు ఆశించి అధికంగా సాగుచేశారు. కానీ వారి ఆశలు ఆవిరయ్యాయి. వారం క్రితం టమాట బాక్స్ రూ. 260 ఉన్న ధర గత రెండు రోజులుగా రూ. 180 పలుకుతోంది. అంటే టమాట కిలోకు రూ. 8 కూడా పలకడం లేదు. దీంతో రైతులు లబోదిబో మంటున్నారు. ప్రస్తుతం పంట అధికంగా చేతికి రావడం ఒక కారణమైతే.. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరను దించుతున్నట్లు తెలుస్తోంది. ధరలేక, దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరతో ఎకరానికి రూ. 50 వేల ఆదాయం కూడా రావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. దీంతో నష్టాలే మిగులుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సిండికేట్‌గా మారారు..



వ్యాపారులు, దళారులు సిండికేట్‌గా మారడంతో టమాట ధర బాగా తగ్గింది. ఈ ఏడాది టమాట పంటకు ఎక్కువ ధర ఉంటుందని ఆశించి పంటను సాగు చేశాను. కానీ ఎక్కువ తెగుళ్లు వచ్చి పంట దిగుబడి రాలేదు. దీనికి తోడు ధర కూడా తగ్గడంతో ఏం చేయాలో తోచడం లేదు. 25 కిలోల టమాట బాక్సుకు రూ. 180 పలుకుతోంది.

– బుల్లెట్ రాంరెడ్డి, రైతు

ఘనంగా స్వామి వారి కల్యాణం


ఆర్మూర్‌టౌన్: పట్టణ కేంద్రంలో క్షత్రియ సమాజ్ సభ్యులు లక్ష్మీనారాయణ స్వామి వారి కల్యాణాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి విగ్రహాన్ని పల్లకీలో ఉంచి పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ అధ్యక్షుడు హజారి మదన్ మోహన్, ప్రాంతీయ సమాజ్ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి ఖాందేశ్ శ్రీనివాస్, కౌన్సిలర్ సంగీత, బారడ్ గంగామోహన్, రమాదేవి, రెడ్డి ప్రకాశ్, గటడి కిషన్, డీకే శ్రీనివాస్, హజారి రమేశ్, బదాం రాజేందర్, షికారి శ్రీనివాస్, సంతని విజయ్, వైద్య రవీందర్, కర్తన్ దినేశ్, సాత్‌పుతే సంతోష్, దుమాని నీరజ్ తదితరులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న సభ్యులు

పచ్చని చెట్లు అగ్గిపాలు

రెంజల్: పచ్చని చెట్లు అగ్గి పాలవుతున్నాయి. హరితహారంలో భాగంగా మండలంలోని రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు పెరిగి పెద్దయ్యాయి. విద్యుత్ తీగలకు తాకుతున్నాయనే కారణంతో ట్రాన్స్‌కో అధికారులు పెరిగిన చెట్ల కొమ్మలను నరుకుతుండగా అవి మొదువారుతున్నాయి. తాజాగా రైతులు పంట పొలాల్లో మొదళ్లకు నిప్పంటించడంతో చెట్లు అగ్నికి ఆహుతవుతున్నాయి. మొదళ్లు కాలుతూ రోడ్లకు ఇరువైపులా పెరిగిన చెట్లకు వ్యాపించి కాలి బూడిదవుతున్నాయి. అధికారులు అవగాహన కల్పించి వృక్ష సంపదను కాపాడాల్సిన అవసరం ఉంది.



శివారులో కాలిపోయిన చెట్లు

మున్సిపల్ కార్మికులపై నిర్లక్ష్యమేల..?

- కనీస వసతులు కరువు
- ఇబ్బందుల్లో కార్మికులు



మున్సిపల్ కార్యాలయం



రక్షణ కవచాలు లేకుండానే పనులు చేస్తున్న కార్మికులు

ఆర్మూర్‌టౌన్: పట్టణాన్ని సుందరీకరణంగా తీర్చిదిద్దుటలో మున్సిపల్ కార్మికుల పాత్ర ఎంతో కీలకం. అలాంటి వారికి కనీస వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో మొత్తం 125 మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు ప్రతి రోజు ఉదయం 5 గంటలకు తమకు కేటాయించిన ప్రధాన వీధులు, రోడ్లపై చేరుకొని పట్టణాన్ని శుభ్రం చేస్తుంటారు. పారిశుద్ధ్యంలో పనిచేసే ప్రతి కార్మికుడికి ప్రతి ఆరు నెలలకు ఒకసారి సబ్బులు, నూనె, డ్రెస్సులు, గ్లౌస్, గన్‌షూస్ అందించి హెల్త్ క్యాంపులు నిర్వహిస్తుంటారు. కానీ గత కొన్ని నెలలుగా కార్మికులకు రక్షణ కవచాలు ఇవ్వడం లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లి తమ సొంత నిధులతో కొనుగోలు చేసిన సబ్బులతో శుభ్రం చేసుకుంటున్నారు. సరైన జీతాలు లేక జీవనం సాగిస్తున్న తమకు మరింత భారం పడుతోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో సుమారు 20వేల పైన కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రతిరోజు 30 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు జరుగుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పరికరాలు అందించాలి

పారిశుద్ధ్య నిర్వహణలో గ్లౌస్‌లు, బూట్లు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. తమ ప్రాణాలకు తెగించి పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. అయినా కనీస వసతులు అందడంలేదు. ఇకనైనా అధికారులు స్పందించాలి. – సాయమ్మ, కార్మికురాలు

సదుపాయాలు కల్పిస్తాం



పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన రక్షణ సదుపాయాలు కల్పిస్తాం. కార్మికులకు ఇంకా ఏవైనా సమస్యలు వాటిని కూడా పరిష్కరిస్తా. పట్టణ సుందరీకరణలో కార్మికుల పాత్ర ఎంతో ఉంది. కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.

– ఎ రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

వేసవిలోనూ నిరంతరం నీటిసరఫరా

- నగరంలో నిత్యం గంటపాటు అందిస్తున్న మున్సిపల్ యంత్రాంగం



అలీసాగర్‌లో నిల్వ ఉన్న నీరు

నిజామాబాద్‌నాగారం: నగర ప్రజలకు వేసవిలోనూ నిరంతరం నీటి సరఫరా జరుగుతుంది. నగరానికి సమీపంలోని అలీసాగర్, మాసానీ, మంచిప్ప చెరువుల్లో ప్రస్తుతం నీటి సామర్థ్యం బాగానే ఉండటంతో నిత్యం నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఉదయం 6 నుంచి 7 వరకు..

నగరంలో 60 డివిజన్లు ఉండగా.. సుమారు 90వేల నివాసాలు, 4లక్షల జనాభా ఉంది. నీటి సరఫరా కోసం 36 వరకు పెద్దపెద్ద వాటర్ ట్యాంకులు ఉన్నాయి. వీటితో పాటు విలీన గ్రామాల్లో సైతం చిన్నచిన్న వాటర్ ట్యాంకులున్నాయి. అధికారికంగా నల్ల కనెక్షన్లు 12వేలు ఉండగా, అనధికారికంగా మరో 10వేల వరకు ఉంటాయని అంచనా. విలీన గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. నగరంలో నిత్యం ఉదయం 6గంటల నుంచి 7గంటల వరకు గంట పాటు నీటి సరఫరా చేస్తున్నారు.

అత్యవసరమైతే ఎస్సారెస్పీ నుంచి

నగరానికి ప్రస్తుతం నీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు చెబుతున్నారు. నిజాంసాగర్ ఎండిపోతే, అత్యవసరం అయితే శ్రీరాంసాగర్ నీటినీ ఎత్తిపోతలతో కోస్లీ నుంచి వెనక్కీ తీసుకవచ్చి నగరానికి సరఫరా చేసి, ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో సైతం ఇదే విషయాన్ని తెలియజేశామన్నారు. ఎడపల్లి మండలంలో ఉన్న అలీసాగర్ నుంచి నిత్యం నగరానికి 35మిలియన్ లీటర్లు నీరు డ్రా అవుతుంది. అలాగే మాసాని నుంచి 20మిలియన్ లీటర్లు, మంచిప్ప నుంచి 4మిలియన్ లీటర్ల నీరు డ్రా అవుతుంది. తద్వారా నగరంలోని ప్రజలందరికీ వేసవిలో తాగునీటికి ఇక్కట్లు లేకుండా అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

నీటి సరఫరాకు ఢోకా లేదు..

నగరానికి నీటి సరఫరాలో ఎలాంటి ఢోకా లేదు. నగరంలో ఇంటింటికీ తాగునీరు ప్రతినిత్యం సరఫరా చేస్తున్నాం. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులకు సైతం నీటి నిలువ గురించి విన్నవిస్తూనే ఉన్నాం. జూలై వరకు నీటి సరఫరాకు ఇబ్బందుల రావు. అందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తాం.

– మురళీమోహన్, మున్సిపల్ ఈఈ

కనుల పండువగా శ్రీవారి కల్యాణం



ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు, పాల్గొన్న భక్తులు

ఆధ్యాత్మికం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలోగల శ్రీదేవి–భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి కల్యాణం కనులపండువగా జరిగింది. ఆలయ ద్వాదశ వార్షికోత్సవాల్లో భాగంగా వేదపండితులు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించారు. అంతకు ముందు ఉదయం హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి వారి కరకమలములచే 108 కలశములతో మహా కుంబాభిషేకం నిర్వహించారు. అలాగే రమా సహిత సత్యనారాయణ స్వామి అభిషేకం, శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి అభిషేకం, బలి ప్రధానము, పూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ, అన్నప్రసాదములు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో ఉత్సవ మూర్తుల ఊరేగింపు నిర్వహించారు. వేడుకలను బ్రహ్మశ్రీ వేలేటి పశుపతి శర్మ, బ్రహ్మశ్రీ ఉమా మహేశ్వర శర్మ, ఆలయ ప్రధానార్చకులు రాహుల్ త్రిపాఠి నిర్వహించారు. ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగిన ఈ వార్షికోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నట్లు ఆలయ ధర్మకర్త రావుల బ్రహ్మానందం తెలిపారు. సభ్యులు కొసరాజు నాగార్జున, నాయుడు ఆంజనేయులు, రవిబాబు, పెదవలి నాగేశ్వరరావు, జంపాని లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.



మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్న హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతీస్వామి

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెర్కిట్: ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన బుధవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిరాం మంగళవారం తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) – 01.20, ఆరంభం (తెలుగు) – 4.15, ప్రసన్న వదనం (తెలుగు) – 7.10, బ్రహ్మచారి (తెలుగు) 10.15
స్క్రీన్-2 –	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ – 11.45, 2.55, 6.05, 9.15
స్క్రీన్-3 –	ప్రతినిధి-2 (తెలుగు) – 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) – 3.10
స్క్రీన్-4 –	కృష్ణమ్మ (తెలుగు)– 12.45, 3.40, 6.35, 9.30

తాటి ముంజ.. భలే మజా

- వేసవిలో మాత్రమే అందుబాటులో..
- ఆరోగ్యానికి ఎంతో మేలు
- నగరంలో జోరుగా విక్రయాలు



నగరంలోని మహాలక్ష్మీ నగర్‌లో తాటిముంజలను విక్రయిస్తున్న విక్రయదారులు

నిజామాబాద్ రూరల్: నగరంలో తాటి ముంజలకు డిమాండ్ బాగా పెరిగింది. వేసవిలో మాత్రమే లభించడంతోపాటు ఆరోగ్యానికి మేలుచేయడంతో తాటిముంజలను కొనుగోలు చేయడానికి నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. విక్రయదారులు వాటిని పెట్టిన గంటల వ్యవధిలోనే అమ్ముడుపోతున్నాయి.

ప్రధాన చౌరస్తాల్లో అమ్మకం..

తాటిముంజలు ఎప్పుడంటే అప్పుడు దొరికేవి కావు. ఎండాకాలంలోనే తాటి చెట్లకు అత్యధికంగా కాస్తాయి. ప్రస్తుతం వాటిని జిల్లా కేంద్రంలోని పలు ప్రధాన ప్రాంతాల్లో విక్రయదారులు విక్రయిస్తున్నారు. పాంగ్రా శివారులోని మహలక్ష్మీనగర్‌తో పాటు పాత కలెక్టరేట్ ఎదుట, కంఠేశ్వర్, దుబ్బ, వర్నిచౌరస్తా, వీక్లీమార్కెట్‌లలో జోరుగా విక్రయాలు జరుగుతున్నానయి. ప్రధానంగా తాళ్ల కొత్తపేట్, ముత్తకుంట గ్రామాలకు చెందిన పలువురు యువకులు రోడ్డు పక్కన ఈ తాటిముంజలను అమ్ముతున్నారు. నగరంలో విక్రయదారులు డజను(12) తాటిముంజలను రూ.80 నుంచి రూ.100 వరకు విక్రయిస్తున్నారు. నిత్యం నగరంలో సుమారు 70 నుంచి 80 డజన్లు అమ్ముతున్నట్లు వారు పేర్కొంటున్నారు. విక్రయాలతో స్వయం ఉపాధి పొందుతున్నామని తెలిపారు.

ఎండాకాలం చలువ..

తాటి ముంజలు తింటే ఎండ దెబ్బ తగలకుండా, చల్లదనంగా ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. ఎండా కాలంలో మనిషికి అలసట రాకుండా, డీహైడ్రేషన్ కాకుండా ఉంచుతుంది. అలాగే గర్భిణులు తాటి ముంజలు తింటే ఆరోగ్యవంతంగా ఉంటారు. ముఖ్యంగా మనిషి బరువును తగ్గించడంతో తాటిముంజలు ఎంతో దోహదపడతాయి. ఇలా తాటిముంజలతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి.

ఆరోగ్యానికి మంచివి..



ఎండాకాలంలో తాటిముంజలు ఆరోగ్యానికి మంచివి. ప్రతి ఒక్కరూ వేసవిలో ఒక్కసారైన ముంజలను తినాలి. డాక్టర్ సైతం తాటి ముంజలను తినాలని చెబుతున్నారు. మనం తీసుకునే పౌష్టిక ఆహారంలో తాటి ముంజలు కూడా ఒక భాగమే.

–అశోక్, తాళ్ల కొత్తపేట్ గ్రామం, విక్రయదారుడు

తాటిముంజలతో స్వయం ఉపాధి..



ప్రస్తుతం ఎండకాలంలో గ్రామంలో పనిదొరకడం అంతంత మాత్రంగానే ఉంది. కాబట్టి తాటిముంజలను నేనే స్వయంగా నగరానికి తీసుకువచ్చి అమ్ముతున్నాను. డజన్‌కు రూ.100 చొప్పున విక్రయిస్తున్నా. నిత్యం ఖర్చులు పోను రూ. 1,500 నుంచి రూ.1,000 వరకు మిగులుతున్నాయి.

–శంకర్‌గౌడ్, ముత్తకుంట, విక్రయదారుడు

వేసవిలో చాలా ఇష్టం..



వేసవిలో మాత్రమే లభించే తాటిముంజులంటే ఎంతో ఇష్టం. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఎండాకాలంలో లభించే తాటిముంజులు చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరూ పౌష్టికాహారంగా తీసుకోవచ్చు.

–బొద్దుల దేవేందర్, నగరవాసి, కొనుగోలుదారుడు

సమాచారం..

నేడు డిచ్‌పల్లి మండల సమావేశం

డిచ్‌పల్లి: మండలకేంద్రంలో బుధవారం డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేడు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ: ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపులకు ఒక్కో గ్రూపునకు 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి పాస్ అయిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 31 లోపు టీఎస్ మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.